క్లుప్తంగా...

ఆక్సిజన్ సిలిండర్ ట్రాలీల వితరణ



నాంపల్లి: నవజాత శిశు సంరక్షణా కేంద్రమైన నిలోఫర్ ఆస్పత్రికి రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంస్థ ఉచితంగా ఆటోక్లేవ్, ఆక్సిజన్ సిలిండర్ ట్రాలీస్‌ను వితరణ చేసింది. ఈ మేరకు మంగళవారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్ఐ డిస్ట్రిక్ట్ 3150 హాజరై ఆటోక్లేవ్, ఆక్సిజన్ సిలిండర్లను అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అసిస్టెంట్ గవర్నర్ సురేష్ గుప్తా, కార్యదర్శి వజ్రాల రాజగోపాల్, అధ్యక్షులు డాక్టర్ జ్యోతిరెడ్డి, నిలోఫర్ ఆస్పత్రి ఆర్ఎంఓ-1 జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు

అబిడ్స్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టీటీఐ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. అబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో విద్యార్థినులకు, సిబ్బందికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. వాహనాలు నడుపుతూ మొబైల్స్ వాడడం ఎంతో ప్రమాదకరమన్నారు. మేజర్ అయిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ సురేఖ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లంకల రవికుమార్, 150 మంది విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోషామహల్ బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించాలి

గోల్కొండ: గోషామహల్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర గ్రంథాలయ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేరును పరిశీలించాలని శ్రీకృష్ణ భారతీయ యాదవ సేవా సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు కాటం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. యాదవ సంక్షేమానికి యాదవుల తరఫున గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఎన్నో సేవలు చేసి త్యాగాలు కూడా చేశారని వారు అన్నారు. మంత్రి తలసాని మాట్లాడుతూ.. పార్టీ అధిస్టానానికి మీ ప్రతిపాదనను సమర్పిస్తానని గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలన్నదే తమ లక్ష్యమని ఆయన అన్నారు. సమితి ఉపాధ్యక్షుడు అశోక్‌యాదవ్, సభ్యులు మధుయాదవ్, సుధాకర్‌యాదవ్, సంగన్నయాదవ్, నగేష్ తదితరులున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



సుల్తాన్‌బజార్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్నో ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారిని తెలంగాణ ప్రభుత్వం పర్మనెంట్ చేయాలని తెలంగాన రాష్ట్ర మెడికల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ ప్రతినిధులు సుందర్, నరేందర్, జోస్నా, శ్రీనివాస్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బొగ్గులకుంటలోని వైడబ్ల్యూసీఏ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే వారిని క్రమబద్ధీకరించేలా సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో ప్రతినిధులు జోత్స్న, సుందర్, శ్రీనివాస్, రాజు, విజయలక్ష్మీ, మౌనిక, సంధ్య, వినోద, లక్ష్మీ, కవిత పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్ హుస్సేని అన్నారు. మంగళవారం టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యాశాఖ ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. 48 మంది ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించడంలో కీలక పాత్ర పోషించడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి విక్రమ్, పాఠశాల విద్యాశాఖ విభాగం నగర కార్యదర్శి ఎం.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ టాప్

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



బీసీ బంధు చెక్కు అందజేస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు

అబిడ్స్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఇండియాలోనే నెం.1 అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమం, ప్రగతి, అభివృద్ధితోనే మరోసారి అధికారంలోకి వస్తామన్నారు. మంగళవారం గోషామహల్ నియోజకవర్గంలోని చుడిబజార్‌లో హరిజన సేవక్ మండలి కమిటీ భవనం పై అంతస్తును రూ.40 లక్షలతో నిర్మించే పనులను, సుబాన్‌పురాలో డ్రైనేజీ సీవరేజీ పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పెన్షన్లు, గృహలక్ష్మి లాంటి పథకాలు అన్నివర్గాల ప్రజలకు వరాలుగా మారాయన్నారు. సెప్టెంబర్ 2వ తేదీ లోపు నగరంలో 12 వేల మందికి డబుల్ బెడ్‌రూమ్‌లు లాట్రీల ద్వారా కేటాయిస్తామన్నారు. మరో వారంలో 12 వేలు, మరో వారంలో 12 వేల చొప్పున డబుల్ బెడ్‌రూమ్‌లు ఇస్తామని మంత్రి వెల్లడించారు. ఇలాంటి అభివృద్ధి పనులు దేశంలో ఎక్కడ లేవన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, హరిజన్ సేవక్ మండలి సభ్యులు మంత్రి తలసానిని భారీ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, సంతోష్‌గుప్తా, మమతా గుప్తా, కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు సురేష్ ముదిరాజ్, రమేష్ గుప్తా, పరమేశ్వరీ సింగ్, మాణిక్‌రావు, హరిజన్ సేవక్ మండలి అధ్యక్షులు కృష్ణ, ఇతర నాయకులు వెంకటేష్, ధర్మేందర్, కిశోర్ పాల్గొన్నారు.

300 మందికి బీసీ బంధు..

గోషామహల్ నియోజకవర్గంలోని బీసీ కులాలకు చెందిన 300 మంది లబ్ధిదారులకు లక్ష రూపాయాల చొప్పునా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి చెక్కులను అందజేశారు. గోషామహల్ హిందీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి చెక్కులను అందజేసి ప్రసంగించారు. లబ్ధిదారులందరికీ రుణాలు వస్తాయన్నారు. ఎవరికైనా రానిచో మరో దఫా అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్లు సురేఖ ఓంప్రకాష్, రాకేష్ జైస్వాల్, శంకర్‌యాదవ్, శశికళ కృష్ణ, బీఆర్‌ఎస్ నేతలు ఆల పురుషోత్తమ్‌రావు, సంతోష్ గుప్తా, నందుకుమార్, అనిత, ప్రియాగుప్తా ప్రకాష్ కుమార్‌గుప్తా, విజయ్ ముదిరాజ్, మున్సిపల్ జోనల్ కమిషనర్ వెంకటేష్, డీసీ బాలయ్య, ఏఎంఓహెచ్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

'పురస్కారాలు స్ఫూర్తిని కలిగిస్తాయి'



నృత్య గురువు ఎస్పీ భారతిని సన్మానిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

గన్‌ఫౌండ్రీ: పురస్కారాలు బాధ్యతను పెంచడంతో పాటు ఎదుటివారికి స్ఫూర్తిని కలిగిస్తాయని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ గౌతమ్‌నగర్, పెండ్యాల నృత్య భారతి అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌ల ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురికి అమృత్ పురస్కార్ అవార్డులను ప్రదానం చేశారు. అంతకు ముందు ప్రముఖ నాట్య గురువు ఎస్పీ భారతి శిష్యుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.రాంచందర్‌రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ జిల్లా పూర్వ అధ్యక్షులు ఎ.లింగారెడ్డి, ఉపాధ్యక్షుడు కె.రాఘవేంద్రరావు, కార్యదర్శి ప్రొఫెసర్ సుదర్శన్ పాల్గొన్నారు.

అంబల్ల జనార్దన్‌కు పురస్కారం



పురస్కారాన్ని అందజేస్తున్న జూలూరి గౌరీశంకర్

నాంపల్లి: తెలుగు వ్యవహార భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు సాహిత్యానికి విశేషంగా కృషి చేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అంబల్ల జనార్దన్‌కు కొసనం సుధాకర్-శ్రీ కళానికేతన్ సాహిత్య పురస్కారం-2023ను ప్రదానం చేశారు. ఈ ప్రదానోత్సవ సభ మంగళవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ టి.గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ జూలూరి గౌరీశంకర్ హాజరై పురస్కారాన్ని అందజేశారు. తెలంగాణ గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్, తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, కళానికేతన్ అధ్యక్షులు శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎ.వి.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేయాలి

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలోని వైద్య విధాన పరిషత్‌ను రద్దుచేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరి హెల్త్ సరీస్‌గా మార్చాలని సీఐటీయూ కో కన్వీనర్ బైరపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కోఠిలోని వైద్య విధాన పరిషత్ కమిషనరేట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరి ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. మెడికల్ కాలేజీలుగా అడ్మిట్ అయిన టీవీవీపీ వైద్యశాలల్లో పదోన్నతుల పోస్టులను విధిగా ఉంచి పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రతి జిల్లాకు డీసీహెచ్ఎస్ పోస్టును క్రియేట్ చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్యానల్ న్యాయవాదుల సమావేశం



చార్మినార్: పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌దారుల కేసులను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని న్యాయవాది ఎజాజ్ అలీ ఖురేషి అన్నారు. జిల్లా సిటీ సివిల్ కోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్యానల్ న్యాయవాదుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే



మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య పాఠశాలలో..

సాక్షి, సిటీబ్యూరో: మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య పాఠశాలలో నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎస్.స్వాతి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం. విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించి, శ్రీచైతన్య స్కూల్ మెహిదీపట్నం జోన్ ఏజీఎమ్ కృష్ణ చేతులమీదుగా బహుమతులు అందించారు. రీజనల్ ఇన్‌చార్జ్ హరి కృష్ణ, అకడమిక్ కో ఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ ఓంకార్, 'సి'బ్యాచ్ ఇన్‌చార్జ్ నదీమ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ డే



మెడల్స్ బహూకరించిన డైరెక్టర్ మిథిలేష్ కుమార్

జియాగూడ: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో ఎదగాలని జియాగూడ ఇంద్రాణి మహా విద్యాలయ డైరెక్టర్ మిథిలేష్ కుమార్ అన్నారు. మంగళవారం నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించి క్రీడలను నిర్వహించారు. క్రికెట్, ఖోఖో, కబడ్డి, రన్నింగ్, గన్నీబ్యాగ్స్ తదితర వాటిల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ బహూకరించారు. హెచ్ఓడీ ఇంద్రాణి, దివ్యజ్యోతి, ఇన్‌చార్జ్ అర్చన, ప్రైమరి ఇన్‌చార్జ్ శ్వేత, శిరీష, రాధిక, మహేశ్వరీ, సరిత, హేమలత, స్వర్ణలత, అశ్విని, లావణ్య, దీప్తి, రిషిక పాల్గొన్నారు.

స్నేహితుడిని గాయపరచిన నలుగురి అరెస్టు

విజయనగర్‌కాలనీ: స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సలు పొందుతుండగా నలుగురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మంగళవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం. ఆసిఫ్‌నగర్ సయ్యద్‌అలీగూడ, టప్పాచబుత్ర గంగాబౌలి ప్రాంతాలకు చెందిన ఐదుగురు యువకులు ఫర్నిచర్ పని చేస్తుంటారు. ఈనెల 27న రాత్రి ఆసిఫ్‌నగర్ చంద్రవైన్స్, బాలాజీబార్‌లో మద్యం సేవించారు. ఐదుగురు స్నేహితులలో స్వల్ప విషయమై జరిగిన తోపులాటలో ముజాహీద్(28) కిందపడడంతో రోడ్డుపై ఉన్న బండరాయి బలంగా తల వెనుకభాగానికి తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని వైద్య చికిత్సల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తలరించారు. బాధితుడి సోదరుడు ముజాఫర్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి అజ్జు(26), కుద్దూస్ (26), మోసీన్ (23), రహీమ్ (29)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైద్య సేవలపై అవగాహన కల్పించాలి

యాకుత్‌పురా: ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలపై అవగాహన కల్పించి వాటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య విధాన పరిషత్తు మెటర్నల్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) ప్రోగ్రామ్ ఆఫీసర్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శిల్పిని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యంపై మహిళా క్లీనిక్ కార్యక్రమం పనితీరుపై మంగళవారం ఆమె యాకుత్‌పురా-2 పట్టణ ఆరోగ్యం కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె యూపీహెచ్‌సీ వైద్యధికారిణి డాక్టర్ ఆయేషా ముదాషీర్‌తో కలిసి బాలింతలకు కేసీఆర్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాఖ మహిళల వైద్య సంరక్షణకు అనేక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు.

మైనార్టీలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి అందజేస్తున్న నందకిశోర్‌వ్యాస్ బిలాల్

అబిడ్స్: మైనార్టీలకు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పెండింగ్ రుణాలను విడుదల చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల పేర్కొన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఇంతియాజ్ ఇసాక్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని మైనార్టీలందరికీ మైనార్టీ లోన్స్ మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ మాట్లాడుతూ..పెండింగ్ దరఖాస్తులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

సట్టా ఆడుతున్న నలుగురికి జైలు

సంతోష్‌నగర్: సట్టా ఆడుతున్న కేసులో నలుగురు నిందితులకు మంగళవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు 3 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ అసద్ చావుస్ (32), మహమ్మద్ షరీఫ్ (49), ఆషమాబాద్‌కు చెందిన ఆష్ఫాక్ (35), జీఎంనగర్‌కు చెందిన మహ్మద్ జావీద్ అలీ (49)లు సట్టా ఆడుతున్నారు. సమాచారం అందుకున్న కంచన్‌బాగ్ పోలీసులు స్థావరంపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం మంగళవారం నలుగురిని నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ లక్ష్మణ్‌రావు నిందితులకు 3 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కత్తితో బెదిరించిన కేసులో వ్యక్తికి జైలు

డబీర్‌పురా: గొడవ చేసి కత్తి చూపించి బెదిరించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించినందుకు నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు నిందితునికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎ.మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అలీ హుస్సేన్ వద్దకు దిలావర్ అనే వ్యక్తి వచ్చి గొడవ చేసి కత్తి చూపించి బెదిరించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించాడు. దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితున్ని నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ లక్ష్మణ్‌రావు నిందితునికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెలే కౌసర్ తదితరులు

గోల్కొండ: ప్రజా ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయుష్ మాన్‌సూన్ మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆయుష్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాలు బాగా ప్రబలుతున్నాయన్నారు. ఈ విషజ్వరాలను అరికట్టడానికి ప్రభుత్వంతో పాటు బల్దియా వారు ఎన్నో చర్యలు చేపట్టారన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని విష జ్వరాల బారినపడుతున్న వారు ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ విభాగం అధికారులతో పాటు మజ్లిస్ నాయకులు ఆరూన్‌ఫరాన్, మిర్జా ఎక్‌బాల్ అహ్మద్, బదర్ ఉద్దీన్ తదితరులున్నారు.

జీఎన్‌ఐటీఎస్‌లో ఫ్రెషర్స్ ఓరియంటేషన్ డే



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: అత్యుత్తమ సాంకేతి విద్యా బోధనకు తమ కళాశాలకు పేరుందని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో ఫ్రెషర్స్‌కు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అల్యుమ్ని హరిప్రియ మల్లాది ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలకు పైగా తమ కళాశాల అత్యుత్తమ నైపుణ్యాధారిత సాంకేతిక కోర్సులను నిర్వహిస్తుందని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. యువతులు నేడు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకుంటున్నారని ఇది మహిళలలో వచ్చిన మార్పుకు కారణమన్నారు. కళాశాల వైస్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి, జి.పుల్లారెడ్డి ఛారిటీస్‌ట్రస్ట్ సభ్యులు జి.ఏకాంబరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, కళాశాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

కార్వాన్ బీజేపీ టికెట్ కేటాయించాలి

జియాగూడ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కార్వాన్ నుంచి బీజేపీ టికెట్‌ను తనకే కేటాయించాలని గోల్కొండ జిల్లా డెయిరీసెల్ కన్వీనర్ బి.శివకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని కలిసి ఆయన బయోడేటాను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జె.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, బీసీ అధ్యక్షుడు జగదీష్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజ్‌పోల్, నరేష్, రామ్, బాబు తదితరులు పాల్గొన్నారు.



బయోడేటాను అందజేస్తున్న శివకుమార్ యాదవ్

సీనియర్లను గుర్తించి టికెట్ ఇవ్వాలి



పార్టీ అధిష్టానానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చార్మినార్: చార్మినార్ శాసనసభ నియోజకవర్గానికి అర్హులైన సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులకు టికెట్ కేటాయించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పార్టీ అధిష్టానాన్ని కోరారు. గత ఎన్నికల్లో చార్మినార్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థికే తిరిగి ఎన్నికల్లో కూడా పోటీ చేయడానికి అధిష్టానం టికెట్ ప్రకటించడం సరైంది కాదని వారు ముకుమ్మడిగా అధిష్టానానికి అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇలియాస్ ఖురేషి, మల్లికార్జున్ యాదవ్, గోపీగౌడ్ పాల్గొన్నారు.

కురుమ రాజ్యాధికార గర్జనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: రాజ్యాధికార సాధనకు కురుమ సోదరులంతా సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్‌కురుమ అన్నారు. వచ్చే నెల 17న జరగనున్న కురుమ రాజ్యాధికార గర్జన సందర్భంగా మంగళవారం గుడిమల్కాపూర్‌లో కురుమ సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు తెలంగాణలో కురుమలు అణచివేతకు గురవుతున్నారని కేవలం తెలంగాణలో దొరల పాలన సాగిస్తుందని అన్నారు. కురుమ రాజ్యాధికార గర్జనలో కురుమ సోదరులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కె.మల్లేశం, కె.శ్రీనివాస్‌రావు, కె.పోచయ్య, దొడ్డి శ్రీనాథ్, అడికె సంతోష్‌కుమార్, శీలంపల్లి సురేష్, జి.కె.చంద్రమౌళి, మహేందర్ తదితరులున్నారు.

అంతరిక్ష మిషన్ యాత్రలో సిటీ కాలేజీ విద్యార్థి



తన మిషన్ గురించి వివరిస్తున్న మోహన సాయి

చార్మినార్: భిన్నమైన ఆలోచన, సంకల్ప సిద్ధి ఉంటే ప్రకృతి సహకరిస్తుందని సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అన్నారు. సిటీ కళాశాలలో బీఎస్సీ బయోటెక్నాలజీ చేసిన ఆకుల మోహన సాయి ఇటీవల పోలాండ్‌లో లునార్ అనలాగ్ అంతరిక్ష మిషన్ విజయవంతంగా పూర్తి చేసుకొని కాలేజీ విద్యార్థుల ముందు తన మిషన్ అనుభవాలను పంచుకున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా కేవలం ఏడుగురు మాత్రమే పాల్గొన్న ఈ మిషన్‌లో ఆసియా ఖండం నుంచి మోహన సాయి ఉండటం కాలేజీకి గర్వకారణమని..కళాశాలలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో అతడిని అభినందిస్తూ విద్యార్థి సమూహానికి ఒక రోల్ మోడల్ అని..అతని ఆసక్తిని గౌరవించి ప్రోత్సహించిన తల్లిదండ్రులు అభినందనీయమన్నారు. అనలాగ్ మిషన్‌లో తన అనుభవాలను వివరించిన మోహన సాయి భౌతికంగా ఎన్ని ప్రతిబంధకాలు ఉన్నా మన ఆలోచనలకు ఉండవని అలా తన ఆలోచనలు, ఆసక్తి నడిపిన మార్గంలోనే తాను అడుగులు వేస్తున్నామన్నారు. పుష్పలత సమన్వయం చేసిన డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్ జె.నీరజా, సుమన యాదగిరి, వసంత, మోహన సాయి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నియోనెటల్ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్

దూద్‌బౌలి: వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. పేట్లబురుజులోని ప్రభుత్వ ఆధునీక ప్రసూతి ఆస్పత్రిలో మంగళవారం నియోనెటల్ అంబులెన్స్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపడుతుందని.. వాటిని మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు చేరవేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ అమృతలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ జైన్, సిబ్బంది ఉస్మాన్, షకీల్, 108 అంబులెన్స్ ఇన్‌చార్జి మంజూర్, యాదయ్య, నాయకులు బాకర్ అలీ ఖాన్, ముజ్జు పటేల్, మహ్మద్ రషీద్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



గౌలిపురా: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర అన్నారు. మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ సర్కిల్-7 డీఎంసీ నరసింహను కలిసి యాకుత్‌పురా నియోజకవర్గంలో కొనసాగుతున్న ఓటర్ల సవరణ తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ నూతన ఓటరుగా నమోదు చేసుకోవడానికి ప్రక్రియ కొనసాగుతుందన్నారు. యువతీ, యువకులు సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ప్రతి పోలింగ్ బూత్‌లో సవరణ, నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిల్లు కలెక్టర్ జగదీశ్వర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్ పాల్గొన్నారు.